# హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక

## ఐదవ పాఠము

# మీ ఆలోచనలను యేసుపై ఉంచుడి

**పాఠ్యోద్దేశము:** వారి ఆత్మీయపతనపు స్థాయిని అర్థము చేసుకొనుటకు ఈ పత్రికను పొందిన హెబ్రీ క్రైస్తవులకు సంబంధించి మనము "ఊహించిన సమస్య"ల పట్టికను వృద్ధి చేసుకొనుట.

## ఉపోద్ఘాతము

హెబ్రీ పత్రికను చదువుటలో మనము ఎక్కడ ఉన్నామో, లేక ఎక్కడలేమో అను దానిని మనము గుర్తించుకొనవలయును. ఈ పత్రిక మనకు **ఏమి అర్థమిచ్చు చున్నదో** అను స్థాయిలో మనము దీనిని చదువుట లేదు. వాస్తవానికి ఈ పత్రిక, గ్రహీతలకు **ఏమి అర్థమిచ్చెనో** అను స్థాయిలో కూడ మనము దీనిని చదువుట లేదు. ఈ పత్రిక పొందిన వారిమధ్య ఏమిజరుగుచుండెనో అనువిషయమునకు సంబంధించి, మన ఊహలను పెంచుకొనుటకు ఇంకా మనము ప్రయత్నము చేయుచునేయున్నాము.

మనము ఇంతకు మునుపు చేసిన అధ్యయనములో, వారు కనీసం రెండు ఖచ్చితమైన సమస్యలు కలిగి యున్నారని రచయిత చెప్పిన సంగతులను బట్టి అర్థము చేసికొంటిమి. ఒకటి, వారు వినుటకు మందులైనందున ఇతరులు వచ్చి వారికి మొదటి "మూలపాఠములనే బోధించే" వారని హెబ్రీ 5:11-6:12ను చదివి గ్రహించితిమి. వారు "వ్యవసాయదారుని పొలము" వలే అనేక ఆశీర్వాదములు పొందియుండిరి. అయినను ఈ పత్రిక వ్రాయబడు సమయానికి యేసుద్వారా వారు పొందిన సంరక్షణకు తగినట్టు ప్రశంసలు పొందు స్థాయిలో వారు ఫలము ఫలించలేదు. లూకా 13:6-9 పోల్చి చూడండి. అయినను, ఒకరికొకరు సహాయము చేయు విషయములో, వారు ఇంకా సంఘముగానే పనిచేయుచున్నారు. "మేలు కీడులను వివేచించునట్లు" తర్ఫీదు పొందు విషయములో వారు పరిపక్వత సాధించలేదు. తత్ఫలితముగా "నీతి" అను లోతైన అంశములను గూర్చి వారు ఆలోచించలేకపోయిరి.

హెబ్రీ 10:32-39లో రచయిత చెప్పిన ఖచ్చితమైన రెండో సమస్యను మనము కనుగొన గలము. క్రీస్తునందు నిత్యము దేవుని కుమారులుగానుండు ఆయన కార్యక్రమమునందు, వారు ధైర్యమును పోగొట్టుకొనిరి లేక పోగొట్టుకొనుచు ఉండిరి. తత్ఫలితముగా "శ్రమలతో కూడిన శిక్షణ" పట్ల వారు అసహనము కలిగియుండిరి. 12:5లో వారు తాము దేవుని కుమారులమను సంగతి మరచిపోయిరని మనము తెలిసికొంటిమి. కుమారత్వము అను వాస్తవమైన గుర్తింపు పట్ల వారి విశ్వాసము మసక బారుచున్నదని భావించవచ్చును. అందువలన, యేసు కలిగియున్నట్టివంటి శీలమును పెంచుకొనుటకు కఠినమైన శ్రమలు అవసరమను వాస్తవమును, వారు ఇప్పుడు ఇష్టపడుట లేదు. హెబ్రీ12:4-13ను చూచినట్లయితే ప్రస్తుతము దేవుడు, క్రైస్తవులను తన నిత్యమైన కుమారులుగా తీర్చిదిద్దుటకు చేపట్టిన క్రమశిక్షణ కార్యక్రమము అర్థము చేసికొనగలము. ఒకప్పుడు హెబ్రీ క్రైస్తవులు క్రమశిక్షణ కార్య క్రమమును ఇష్టపడిన వారని హెబ్రీ 10:32-34ను చదివితే అర్థము చేసికొనగలము.

మన గత పాఠములో "ఊహించిన సమస్య"ల పట్టికను తయారు చేసికొనుటను మొదలు పెట్టితిమి. ఈ పాఠములోను మరియు మన రాబోవు పాఠములోను ఈ పట్టికను పెంచుకొను పనిని మనము కొనసాగింతుము. దీనిని పూర్తిచేసిన తరువాత, ఈ పట్టికను, మన "ఖచ్చితమైన సమస్య"ల పట్టికతో సరిపోల్చి, దానితో కలిపి, పత్రిక పొందిన వారి మధ్య ఏమి జరుగుచున్నదో అను విషయమునకు సంబంధించి ఒక **తాత్కాలిక అభిప్రాయమునకు** వచ్చెదము. ఊహించిన మాటల కంటే ఖచ్చితమైన మాటలకే అధిక ప్రాధాన్యత కలదు అని జ్ఞాపకము చేసికొనుము. ఈ పత్రిక పొంది నపుడు, పత్రిక పొందిన వారిమధ్య ఏమి జరుగుచున్నదో అను మన తాత్కాలిక దృక్పథమును మనము ఏర్పరచుకొన్న తరువాత, సాహిత్యపరమైన విశ్లేషణను తయారు చేయుదము. అనగా, ఆ పరిస్థితిని బట్టి వారికి ఏమి చెప్పబడినదో మనము దానిని విశ్లేషించుదము.

"వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెనని" హెబ్రీ 2:1లో రచయిత చెప్పినట్లు నాల్గవ పాఠములో మనము వింటిమి. ఈ విషయములో హెబ్రీ క్రైస్తవులు దోషులని రచయిత చెప్పలేదు. విశేషముగా ఎత్తిచూపబడిన మాటలు ఊహిస్తూ చెప్పిన మాటలకు ఒక ఉదాహరణ. కాబట్టి, ఖచ్చితమైన సమాచారముతో మనము ఊహించు మాటలను కలిపి ఆలోచించినట్లయితే, ప్రత్యేకముగా ప్రస్తావించబడిన వారి సమస్యలకు సంబంధించి వారి ఆత్మీయ స్థాయిని గూర్చిన మెరుగైన దృక్పథమును మనము కలిగియుండగలము. దేవుని సందేశమును నిర్లక్ష్యము చేసిన యెడల, ఆయన విధించు దండనను ఎవరు తప్పించుకొనే అవకాశము లేదని రచయిత చేసిన హెచ్చరికను జ్ఞాపకము చేసుకొనుము. ఆత్మీయ విషయములో శ్రద్ధ చూపాలని "హెచ్చరింపబడు స్థాయికి" వారు దిగజారిపోయిరని దీని భావము కావచ్చును.

## పాఠము

పాత నిబంధనలో ప్రఖ్యాతి గాంచిన పాత్రను ఎన్నుకొనిన రచయిత యొక్క శైలితో మనము ఇప్పుడు ముందుకు సాగుదము. అతడు మోషే అను వ్యక్తి. దయచేసి హెబ్రీ 3:1-6ను చదువుము. గత పాఠములో మనము గమనించిన మూడు మెట్లను తిరిగి ఇక్కడ చూడగలము. మొదటి మెట్టులో, మోషే దేవునికి గొప్ప సేవకుడను విషయము వారెరుగుదురని, రచయిత తనదైన

శైలితో వెల్లడి చేసెను. రెండవ మెట్టులో, మోషేకు మరియు యేసుకు దేవుని ఇంటితోగల సంబంధమును తెలుపుతూ అసమానశక్తిగల యేసును దేవుని ఇంటిలో కీర్తినీయునిగా చూపెను. యేసు దేవుని ఇంటి మీద కుమారుడు మరియు మోషే దేవుని ఇల్లంతటిలో సేవకుడని రచయిత చెప్పెను. మూడవ మెట్టులో, గ్రహీతలకు సంబంధించిన రచయిత యొక్క హెచ్చరిక కలదు. క్రైస్తవులు దేవుని ఇల్లు అను మాటలు చెప్పి, అక్కడితో రచయిత ఆపియున్న ట్లయితే, గ్రహీతలు బాగానే నడుచుకొనుచున్నారని మనము భావించే వారము, గాని "ధైర్యమును నిరీక్షణ వలని ఉత్సాహమును తుదమట్టుకు స్థిరముగా చేపట్టిన యెడల మనమే ఆయన ఇల్లు" (హెబ్రీ 3:6) అను ఈ హెచ్చరికను గమనించుము. హెబ్రీ క్రైస్తవులు ధైర్యము మరియు సహనము కలిగి యుండు విషయములో సమస్య కలిగియున్నారని రచయిత వారితో ప్రత్యేకముగా చెప్పుటను గూర్చి మనము వింటిమని జ్ఞాపకము చేసుకొందము. వారొకవేళ వెనుకడుగు వేస్తు నాశనమునకు సమీపిస్తున్నారేమో (10:35-39)!

క్రైస్తవ్యము, విశ్వాసులకు ఏమి అందించబోవుచున్నదో దానిని బట్టి ఈ క్రైస్తవులు అతిశయ పడుచున్నారేమో! అయినప్పటికిని, ఆ నిరీక్షణ పట్ల తమకు గల బలహీనమైన విశ్వాసమును బట్టి కలుగు తక్కువ స్థాయి ధైర్యముతో వారు ప్రవర్తిస్తున్నారేమో! తాము దేవుని ఇల్లు అని వారు ప్రకటించుకొంటున్నను, ఆ విషయములో వారి పట్టు సడలిపోతున్నదేమో! అందుకే "కొట్టుకొని పోకుండునట్లు" (2:1) మరియు "చేపట్టిన యెడల" (3:6) అను పదజాలములను రచయిత తాను చేసిన హెచ్చరికలో విని యోగించెను. గ్రహీతలు ఏ స్థితికి దిగజారిపోవుచున్నారో మనము అర్థము చేసు కొనుటకు, ఇలాంటి పదజాలములు మనకు ఉపయోగపడును.

మొదటి రెండు అధ్యాయములలో ఎక్కువ విషయములను మనము "దాటి యున్నామని" గుర్తించుకొనవలెను. ఇప్పుడు మనము ఈ పత్రికను చదువుటలేదని నొక్కి చెప్పుచున్నాము. మనము చారిత్రాత్మక మరియు సాహిత్యపరమైన విశ్లేషణను చేయుచున్నాము. ఈ పత్రిక పొందినవారి మధ్య ఏమి జరుగుచున్నదో అను మన ఊహకు ఒక రూపమిచ్చిన తరువాత, ఈ పత్రిక వ్రాయబడిన విధానములోనే మనము దీనిని చదువుటకు ప్రయత్నించుదము. నిజమే, మన "ఊహలు ఖచ్చితమైన"విగా ఉండాలి, లేక వాస్తవానికి దగ్గరగా ఉండాలి.

మనము రచయిత యొక్క శైలిని అనుసరిస్తున్నప్పటికిని, రెండవ అధ్యాయములో ఎక్కువ సంగతులు, దూతలను గూర్చి చెప్పబడినదను విషయమును మనము ఎరిగి ఉండాలి. యేసు యొక్క యాజకత్వము మరియు పాపపరిహారార్థబలిగా ఆయనే బలి ఆయెనను విషయము కూడ, రెండవ అధ్యాయములో పరిచయము చేయబడెను. యేసు దేవదూతలకు సహాయము చేయుటకు రాలేదని రచయిత చెప్పుచు, అబ్రాహాము సంతానమునకు సహాయము చేయుటకే ఆయన వచ్చెనని చెప్పెను (2:16). ఆ సంతానమే జ్యేష్ఠుల సంఘసభ్యులు, దేవుని ఇల్లు మరియు "పరలోకపు యెరూష లేము" (12:22, 23). 5:1-10:18లో శక్తిలోను, నాణ్యతలోను యేసు యొక్క యాజకత్వము, లేవి యాజకత్వము కంటే ఎంత శ్రేష్ఠమైనదో నిరూపిస్తు రచయిత దానిని చూపెను.

ఏ సమస్యను పరిష్కరించుటకు ఈ పత్రిక వ్రాయబడెనో, దానిని గూర్చి మెరుగైన అవగాహన కలిగి యుండుటకు మనము తిరిగి వచ్చెదము. రచయిత ఈ "మూడు మెట్ల" పద్ధతిని ఉపయోగించు పనిని కొనసాగిస్తున్నాడు. దయచేసి హెబ్రీ 3:7-4:16 వరకు చదువుము. ఇశ్రాయేలీయుల 40 సంవత్సరముల అరణ్య ప్రయాణమును మరియు దేవుని విశ్రాంతిలో ప్రవేశించుదమను వారి నిరీక్షణను గూర్చి ఈ హెబ్రీ క్రైస్తవులు బాగా ఎరుగుదురు. దేవుడు తన ప్రజలకు వాగ్దానము చేసిన **విశ్రాంతిని** గూర్చి ఈ చర్చ జరిగినది. ఇశ్రాయేలీయులు ఎక్కడ ఈ విశ్రాంతిని అనుభవించాలి? కానానులోనా? కాదు. దేవుని ప్రజలకు విశ్రాంతి ఇంకా నిలిచి యున్నదని రచయిత నొక్కి చెప్పుచున్నాడు. యేసు ద్వారానే దేవుని విశ్రాంతిలోనికి మార్గము ఏర్పడినది.

మూడవ మెట్టులో, 3:7-4:16 లో గల మన పాఠ్యాంశమంతటిలోను రచయిత తన ఉపదేశమును హెచ్చరిక రూపములో తెలిపెను. విశ్వాసము లేని వారి దుష్ట హృదయములను గూర్చి 3:12 వచనము నుండి రచయిత చేసిన హెచ్చరికను చూడగలము. పాపము వలన కలుగు భ్రమచేత వారు కఠిన పరచబడకుండునట్లు, వారు ఒకరినొకరు ప్రోత్సహించుకొంటూ, ఒక సంఘముగా, దేవుని ఇల్లుగా ఉండ వలసిన అవసరము వారికి ఎంతైనా ఉన్నది. దేవుని నుండి ఒక క్రైస్తవుడు దూరమగు టకు హృదయ కాఠిన్యమే ముఖ్య కారణము. "గనుక మనము కనికరింపబడి సమ యోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము యొద్దకు చేరుదము" అని చివరిగా 4:16లో రచయిత హెచ్చరించెను.

ఈ క్రైస్తవులు ఒకప్పుడు కలిగియున్న స్థితిని ఇప్పుడు కలిగియుండలేదని,రచయిత వారిని గూర్చి చెప్పిన ఖచ్చితమైన మాటలను బట్టి మనము అర్థము చేసుకొనగలము. ఏ రీతిగా వారి హృదయములు కఠినమైవో రచయిత ప్రస్తావించి యుండవచ్చును. వారు తమ సొంత పాపములు చేత మోసగింపబడిరి. మోసము, మనలో ధైర్యము తగ్గుటకు దారి తీయును. పాపమనగా ఏమిటి? దేవుని మాటలకు అవిధేయత చూపు టయే పాపము, మరియు అవిశ్వాసమే అవిధేయతకు మూలము (3:18,19). అవి శ్వాసము వలన ఇశ్రాయేలీయులనేకులు, పాలు తేనేలు ప్రవహించు దేశములోప్రవేశింప లేకపోయిరి. ఈ క్రైస్తవులు కూడ అలాంటి పరిస్థితిలోనే ఉన్నారేమో?

నాల్గవ అధ్యాయము 1,2వ వచనములలోగల కొన్ని హెచ్చరికలు, వారి సమస్యలు మరియు ఆ సమస్యలకుగల కారణములను తెలుసుకొనుటకు మనలో కొంత పరిజ్ఞానము కలుగజేయును.

ప్రకటింపబడిన వాక్యముతో వినిన వారి విశ్వాసము మేళవించబడాలి. బహుశా, కొంతకాలము నుండి ఈ సహోదరులు తమ క్రైస్తవ విశ్వాస జీవితములో దిగజారిపోతున్నారేమో? వారు వాక్యము వినుచుండిరి గాని, వాస్తవానికి వాటిని నమ్ముటలేదు. అయినను బాహ్యమునకు మతము కలిగినవారిగా అగపడుటను వారు కోరుకొనిరి. “వివరింప వీలుకావని అనుకొనిన విషయములో” బహుశా వారు దేవుని పట్ల అవిధేయత చూపుటను మొదలు పెట్టిరేమో? కాలము గడచిన కొలది వారి హృదయములు కఠినములాయెను. అనగా చిన్న చిన్న పాపములు అని వారు భావించిన వాటి విషయములో ఇక దోషారోపణ లేకుండా వారుండిరి. “దేవుని దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు” అని రచయిత (హెబ్రీ 4:12, 13)లో చెప్పెను. వారిలో కొంతమంది ఆత్మీయ జీవితములో దిగజారిపోవుచు కొంత కాలము పాపములో జీవించినను, తాము పరలోకమునకు వెళ్ళగలమని భావిస్తూ ఉండవచ్చునని వారిని గూర్చి రచయిత చెప్పుచున్నాడా? ఇవన్నియు మనము, “ఊహించిన సమస్య”ల పట్టికకు సంబంధించినవే.

ఇప్పుడు మనము మన ఎక్సజిటికల్ పనిని కొద్దిసేపు ఆపి ఒక రెండు ఊహలు “ఇప్పుడు, ఇక్కడ” మనకెలాగు పనిచేయును అను ఆలోచనను చేయుటకు పూను కుందాము. దీనినే హెర్మెన్యూటిక్స్ అను సాంకేతిక పదముతో పరిగణించుదురు. ఎప్పుడైతే క్రైస్తవులు దేవుని వాక్యమును అర్థము చేసుకొని, దేవుని వాక్యమందు నమ్మిక ఉంచి మరియు దానియందు విశ్వాసముంచుదురో అప్పటినుండి మన మనస్సాక్షి మన ఆత్మీయ పరిస్థితిని గూర్చి అవగాహనను ఇచ్చును. మన హృదయము విశ్వాసము ద్వారా ప్రేరేపింపబడుచున్నదో లేదో అని మనలను పరిశీలించు కొనుటకు మనము ఇష్టపడిన యెడల ఇది నిజమని తెలియును. 1 కొరింథీ. 4:4, 8:12; 2 కొరింథీ. 13:5 చూడుము. దేవుడు మనలో ప్రతి ఒక్కరిలో అమర్చిన “స్కానింగ్ పరికరముల” యొక్క సరియైన పనితీరును కొరింథీ లేఖన భాగములలో చూడగలము. ఏది మంచి మరియు ఏది చెడు అను విషయములను గూర్చిన పరిజ్ఞానముపై ఆధారపడి మన మనస్సాక్షి యొక్క పని తీరు ఉంటుంది. (హెబ్రీ. 5:14). మనము పైన నేర్చుకొన్నరీతిగా, హెబ్రీ క్రైస్తవుల బైబిలు విద్య విధానము ఈ స్థాయిలో లేదు.

మన జీవితములు దేవునికి పారదర్శకముగా కనబడుచున్నవి. మనము ఎంతగా దేవుని వాక్యము అర్థము చేసుకొని మరియు ఆ వాక్యమునందు ఎంత విశ్వాస ముంతుమో అంత చురుకుగా ఆయన వాక్యము మన మనస్సాక్షితో పనిచేసి మన “హృదయము యొక్క వైఖరులలో” ఏయే మార్పులు అవసరమై ఉన్నాయో అర్థం చేసుకొనుటకు సహాయము చేయును హెబ్రీ 4:12. మన ప్రధాన యాజకుడైన యేసు క్రీస్తు, మనలను మనము పరిశీలన చేసుకొనుటకు, మరియు సరిదిద్దుకొనవలసిన పాపము విషయములో ఒప్పుకొనుటకు సహాయము చేయును (హెబ్రీ 4:14-16).

“దేవుని ప్రజలకు విశ్రాంతి నిలచి యున్నది” అని హెబ్రీ 4:9లో రచయిత వారికి చెప్పుచున్న మాటలను వింటున్నాము. ఇప్పుడు మనము అప్పుడు-అక్కడ పనికి తిరుగుదము. అయినను, ప్రస్తుతము దేవుని కార్యక్రమము ఇప్పుడు, పనిని పూర్తి చేయుము-ఆ తరువాత విశ్రాంతి,” ఇప్పుడు “విశ్రాంతి సమయము” కాదు. తదుపరి వచనములో వారు, ఏ అవిధేయత చూపినను, వారు చూచినను చూడక పోయినను, దేవునికి తేటగా కనబడునని రచయిత వారిని హెచ్చరించెను. భూమి మీద తమ పని పూర్తిచేసిన తరువాత, దేవునికే తాము లెక్క అప్పగించవలసి ఉన్నది గనుక, స్వచ్ఛమైన (పారదర్శకమైన) జీవితము జీవించవలసిన అవసరము వారికున్నది. “తమ్మును తాము” దాచుకొనుట పరిష్కారము కాదు. సరైన వ్యక్తితో వారు ఆ మాటలు చెప్పగలిగితే, దాని గురించి మాట్లాడుటయే ఒక జవాబు అవుతుంది. “మన బలహీన తలయందు సహానుభవము” కలిగిన యేసుక్రీస్తును దేవుడు వారికి అను గ్రహించెను (హెబ్రీ 4:15). యేసుక్రీస్తు వీటన్నిటిని ఎదుర్కొని విజయము నొందిన వాడు. సహాయముచేయుటకు యేసు సిద్ధముగా ఉన్నాడు. కాని ఆయన “కృపా సనము” నొద్దకు చేరుటకు వారు ధైర్యము కూడగట్టుకొనవలెను.

వాస్తవానికి, విశ్వాసము లేని కఠిన హృదయము కలిగియుండుటయే వారి సమస్యకు మూలమైన యెడల, రచయిత తన పత్రికలో ఈ శైలిని ఎందుకు ఉపయోగించుచున్నాడో మనము అర్థము చేసుకొనగలము. హెబ్రీ క్రైస్తవులు బాగా ఎరిగిన, పాత నిబంధనలో గల ఒక వ్యక్తి లేక పరిస్థితిని ముందు వారికి తెలియ పరచుటయే రచయిత వినియోగించు మొదటి మెట్టు. తరువాత మహిమాన్వితుడును శక్తివంతుడైన దేవుని కుమారుడగు యేసుక్రీస్తుతో ఆ పరిస్థితి లేక వ్యక్తిని సరిపోల్చుతు, అందమైన మరియు శక్తివంతమైన ఒక పోలికను రచయిత తయారుచేయును. వారు క్రైస్తవులైన దినములలో యేసును గూర్చి మొదట వెలిగింపబడిన విషయమును వారు జ్ఞాపకము చేసుకొనవలెనని వారికి విజ్ఞాపన చేయుటయే, రచయిత వినియోగించు రెండవ మెట్టు. వారి విశ్వాసమును తిరిగి కట్టుటకు అతడు ప్రయత్నించుచున్నాడు. వారు తమ ఆలోచన శక్తికి పదును పెట్టవలెనని వారికి విజ్ఞప్తి చేయుటయే రచయిత వినియోగించు మూడవ మెట్టు.

తన పత్రిక ద్వారా చేసిన విజ్ఞప్తి, గ్రహీతల మనస్సు, హృదయములలో హేతు బద్ధమైన ఆలోచనలను రేకెత్తించకపోయినట్లయితే, తమ ఆత్మల రక్షణ విషయములో వారు కొట్టుకుపోవుచున్నారని రచయిత వారిని గూర్చి భావించవచ్చు. తమ పూర్వపు దినములను మరియు ఈ పత్రిక వ్రాయబడు సమయమునకు వారి ఆత్మీయ జీవితములోగల వ్యత్యాసమును, వారు బాగా ఎరిగియుండవలసినవారైయున్నారు. వారు “మార్గము తప్పియున్నారని” రచయిత ఇంకొక శైలిలో వారికి చెప్పి యుండ వచ్చును. తలిదండ్రులు తరచుగా ఈ పద్ధతిలోనే తమ పిల్లలను హెచ్చరించుదురు. మనము పిల్లలకు బుద్ధి చెప్పెదుము, మరల మరల వారికి చెప్పెదుము. గాని వారి సమస్యలను పరిష్కరించుటకు వేరొక పద్ధతి (శైలి)ని అప్పుడప్పుడు ఆశ్రయించుదుము. హెబ్రీ

పత్రిక రచయిత చేసినట్లు, పరిస్థితిని గూర్చి మన పిల్లలు కూడ ఆలోచించాలని మనము కూడ వారివలె వ్యవహరిస్తూ ఉంటాము. పరిస్థితి విషమించినప్పుడు, అనగా తరచుగా విను సందేశమందు విశ్వాసము కోల్పోయినప్పుడు, వినుటకు మందులుగా ఉండే సమస్యలో చిక్కుకొని ఉంటారు గనుక అట్టివారి విషయములో ఈ పద్ధతినే వినియోగించాలి.

హెబ్రీ క్రైస్తవులు యూదా మతములోనికి తిరిగి వెళ్ళుచున్నారని తరచుగా మనకు చెప్పబడు విషయమునకు సంబంధించిన ఆధారములు ఎక్కువగా మనకు ఈ పత్రికలో కనబడవు. ఈ మాటలు, రచయిత 13:11-14లో చేసిన సాధారణ హెచ్చరిక లోనిదే. ఈ హెచ్చరిక, మనము "ఊహించిన సిద్ధాంతపరమైన సమస్యల" పట్టిక క్రిందకు వచ్చును. భౌతిక యెరూషలేమునకు ఇక ఏమాత్రము ప్రాధాన్యత లేదని రచయిత ఈ లేఖనములో చెప్పెను. "మనమాయన నిందను భరించుచు శిబిరము వెలుపలికి ఆయన యొద్దకు వెళ్ళుదము. నిలువరమైన పట్టణము మనకిక్కడ లేదు" (హెబ్రీ 13:13, 14) అని అతడు చెప్పెను. కొందరు ఈ పట్టణము యొక్క గత మహిమను పట్టుకొని వ్రేలాడుతు ఉండవచ్చును. అయినను రచయిత ఈ క్రైస్తవులకు వ్రాసిన వాటిలో "ఖచ్చితమైన సమస్యలు" మరియు "ఊహించిన సమస్యల" పట్టికతో దీనిని చూచెదము.

వాస్తవానికి దేవుడు తన కథలో ఏ ఉద్దేశముతో పాత నిబంధనలోని అంశములను మరియు వ్యక్తులను వినియోగించెనో, రచయిత కూడ అలాగే వినియోగించుచున్నాడో లేదో మనము చూచెదము. యూదా మతము అను తప్పుడు సిద్ధాంతమును గూర్చి ఈ గ్రంథములో అసలు ప్రస్తావించబడలేదు ఇది పరిసయ్యుల సిద్ధాంతము. యేసు యూదా మతమును తిరస్కరించెను గాని ధర్మశాస్త్రము మరియు లేవి యాజకత్వము పట్ల అయనకు గొప్ప గౌరవముండెను. మత్తయి 23:1-4ను చూడుము. దూతలు, అబ్రాహాము, మెల్కీసెదెకు యాజకత్వము మరియు మోషే అను అంశములు ఒకే వర్గమునకు లేక యుగమునకు చెందినవి కాకపోయినను, గ్రహీతలు వీరందరనిగూర్చి ఎరుగుదురని రచయిత తాను చేసిన హెచ్చరికలో విరివిగా వీరిని వినియోగించెను.

ఒకవేళ ఈ ప్రజలు బోధనపరమైన సమస్య కలిగి యున్న యెడల, అది ఆత్మీయ ఎదుగుదలకు సంబంధించిన సమస్యంత తీవ్రమైనది కాదు. యూదా మతములోనికి ఈ క్రైస్తవులు తిరిగి వెళ్ళుచున్నారను దృక్పథముతో ఈ గ్రంథమును మనము చదివిన యెడల, ఆత్మీయ సమస్యలకు సంబంధించి వ్రాయబడిన దైవిక ఉపదేశము పొందు అవకాశమును మనము పోగొట్టుకొన్నట్లు ఉంటుంది. మన చారిత్రక మరియు సాహిత్యపరమైన విశ్లేషణ ద్వారా మన "దృక్పథము" వృద్ధిచెందవలెనని గమనించుము. ఈ గ్రంథమును విశ్లేషించు అన్ని విషయములు కాకపోయినా మనము ఎక్కువ సమా చారమును కనుగొనగలము. మనము వ్యాఖ్యానములపై ఆధారపడము.

మన తరువాత పాఠములో రచయిత యొక్క శైలిని అనుసరించుచు యేసుక్రీస్తు యొక్క యాజకత్వము మీద వారి ధైర్యమును బలపరచుచు, ఆయన మెల్కీసెదెకు క్రమము చొప్పున యాజకుడుగా ఎలాగు పనిచేయుచున్నాడో చూచెదము.